ఆంధ్రభూమి ఆదివారం (7.12.2003)

# ఇందిర

"మేం - సన్మానానికి వెడుతున్నాం - మీ సంగతేమిటి?"

రాఘవరావు - కళ్ళు తెరిచాడు.

ఎదురుగా - భార్య- పట్టుచీరలో - ఆ ప్రక్కన ఇద్దరు కొడుకులు - కోడళ్ళు -నలుగురు మనవలు - ఇద్దరు మనవరాళ్ళు అంతా - సొమ్ములు ధరించి - షోకులు చేసుకుని - అందంగా - ఆనందంగా ఉన్నారు.

"నాన్నను ఎలా తీసుకెడతామే?"

కొడుకు అనుమానం-

"అత్తయ్య- కారు పంపితే"

ఓ కొడుకు - ఆశ.

"ఊర్లోకి ప్రొద్దుననగా వచ్చిందిట. ఇంతవరకు ఈ ఇంటి ఛాయలు కన్నా రాలేదే - అయ్యో సంబడం - కారు పంపుతుందా - ఏదో మనమ్మాయికి సన్మానం - అని - వెళ్ళడమే గాని... దానికామాత్రం అభిమానం - ఉంటే - ఇంకేం?"

"మీరు వెళ్ళండి" - రాఘవరావు చెప్పి - మళ్ళీ కళ్ళు మూసుకున్నాడు.

"నాన్నకు కోపం ఇంకా తగ్గలా?..."

ఆటోలో వెళ్ళిన చప్పుడు.

అంతా వెళ్ళారన్న నమ్మకం కలికయ చెయ్యి కూడదీసుకుని, కళ్ళద్దాలు సరిచేసుకుని, ఓ చేత్తో పేపరు అందుకున్నాడు రాఘవరావు.

"ప్రఖ్యాత సినీనటి ఇందిరకు సన్మానం."

నవ్వుతూ - ఇందిర ఫోటో - ఆ ఫోటో క్రింద - ఇందిర జీవిత విశేషాలు

అభిమాన సంఘాల ప్రకటనలు - సినిమా థియేటర్ల వారి స్వాగత ప్రకటనలు.

రాఘవరావు చేతిలోంచి దినపత్రిక జారిపోయింది. కళ్ళకున్న జోడు ప్రక్కకు పోయింది.

.....అందరిలోకి కడగొట్టు పిల్ల ఇందిర.

నలుగురు అన్నలు - ఇద్దరు అక్కలు. తల్లీ - తండ్రీ కాలం చేసే నాటికి - ఇందిరకు పదేళ్ళు-

పచ్చి పసుపుకొమ్ములా ఇందిర ఇంట్లో తిరుగుతుంటే - తెలియని వాళ్ళు.

"మీ పెద్దమ్మాయా" అని అడిగే వాళ్ళు

"కాదు నాయనా - మా అత్తగారు పోతూ పోతూ - మాకిచ్చిపోయిన ఆస్తి - కడగొట్టు ఆడబడుచు" - రాఘవరావు భార్య సమాధానం!

"అన్నయ్యా - చదువుకుంటా!"

"ఉద్ధరిస్తావు - ఆడపిల్లకు చదువెందుకూ - బియ్యేనా - ఎమ్మేనా చదివించడానికి - మీ నాయన - భూములేం మిగల్చలా - ఆయనొక్కడి సంపాదన - చదువులు - చదువు ఉద్యోగం చేసి మమ్మల్నేం ఉద్ధరించక్కర్లా.." - ఈసడింపు.

రాఘవరావు - సమాధానం చెప్పలేడు. కారణం ఆర్థిక పరిస్థితులు.

తమ్ముళ్ళ చదువులు - ఇద్దరు చెల్లెళ్ళ పెళ్ళిళ్ళు - అన్న చూడాలి - సంపాదన అంతంత మాత్రం.

రాఘవరావు తల వంచుకోవడం నేర్చుకున్నాడు.

అలా తల వంచడం - రాఘవరావు జీవితంలో క్రమంగా ఒక భాగం - అలవాటుగా మారింది.

తమ్ముళ్ళు విడిపోయారు.

చెల్లెళ్ళు పెళ్ళిళ్ళు చేసుకు వెళ్ళారు.

ఇంత జరిగేసరికి రాఘవరావు సంతానం ఎక్కి వచ్చారు.

రాఘవరావు సంసారమనే బండిని ఒంటిగా లాగుతూనే వున్నాడు.

ఇందిర - విశారద పాసైంది. స్వంతంగా - మెట్రిక్ పాసయ్యింది.

అప్పుడూ రాఘవరావు - తల వంచుకున్నాడు, సిగ్గుతో.

కారణం - తోడబుట్టిన చెల్లెలు - ఏ అలనా పాలనా లేకుండా పెరుగుతున్నది.

స్వతంత్రంగా తనకో వ్యక్తిత్వం కల్పించుకుంది. అయ్యో, నేనేం చెయ్యలేక పోయానే అన్న దిగులు - పోన్లే చెల్లెలు ప్రయోజకురాలవుతున్నదన్న సంతోషం - ఇవేవీ భార్య కంటపడకుండా - తల వంచుకునే ఉన్నాడు రాఘవరావు, నిండుకుండలా!

కానీ ఇందిర రంగస్థలం ఎక్కి వేషం వేసేసరికి...

"ఇది సంసారుల కొంప - సిగ్గు, ఎగ్గు లేకుండా పదిమంది మొగాళ్ళతో తిరిగి తైతక్కలాడుతుంటే - ఇంటి పరువేంగాను? రేపు నా పిల్లల బ్రతుకేం గాను?" అని భార్య అంటే, రాఘవరావుకు సమాధానం తెలియదు.

"అన్నయ్యా ఊళ్ళో లాయర్లు అందరూ గౌరవనీయులే - అడిగారు - వేషం వేశా. నే తప్పేం చేయలేదు" - ఇందిర సంజాయిషీ.

రాఘవరావు అప్పుడూ మాట్లాడలేదు. చెల్లెలు వైపు జాలిగా చూశాడు.

లాయర్లు ఇందిర వేషానికి మెచ్చి - సత్కరించారు. డబ్బు ఇచ్చారు.

ఆ తరువాత మెడికల్ కాలేజీ విద్యార్థులతో నాటక ప్రదర్శన.

'పోలీస్ మీట్‌లో - .ాటకం - నటనలో, ఇందిరకు ప్రాముఖ్యత పెరిగింది - రాబడి పెరిగింది, ఒక రకంగా!

"ఆడది సంపాదిస్తున్నది - డబ్బు తెస్తున్నది గదాని అలా తల వంచుకుని సంతోషిస్తున్నారేమో - ఎప్పుడో మీకు తలవంపులు తెస్తుంది. ఓ మొలతాడున్న వాడిని తెచ్చి పెళ్ళి చెయ్యండి. కనీసం పరువైనా దక్కుతుంది" - భార్య సలహా.

"అన్నయ్యా- నాకు నా మీద నమ్మకముంది. నాకు తల్లీ, తండ్రీ, దైవం అన్నీ నీవే! నువ్వు ఊ అంటే ... ఈ వేషాలేసుకునే బ్రతుకుతా?" ఇందిర ధీమా.

రాఘవరావు అవుననలేదు - కాదనీ అనలేదు - ఇందిర మాటల్లో - నిజాయితీ ఉంది.

ఇందిర ఇల్లు వదిలి వెళ్ళిపోయింది. రాఘవరావుకి అన్నీ గుర్తొచ్చాయి. ఒక చేత్తో కళ్ళు తుడుచుకున్నాడు.

ఇందిర - ఈనాడు తార - పుట్టి పెరిగిన ఊళ్ళో - సన్మానం - ఘనంగా!

తారకా సన్మానం - లేక ఇందిర వ్యక్తిత్వానికా...

ఏమో...!

ఆటోలు వచ్చాయి.

"అబ్బబ్బ..ఏం జనం... ఏం జనం అయిన వాళ్ళం మాకే ఇందిర దగ్గరకు వెళ్ళే అవకాశం రాలేదు. మీరు రాకపోవడమే మంచిది. ఏం జనం... అబ్బబ్బ.."

రాఘవ భార్య మాటల్లో, ముఖంలో ఆనందం.

రాఘవరావు భార్యనే చూస్తూండి పోయాడు. ఈవిడే ఒకానొకప్పుడు ఇందిర ఇంటికి వస్తే...

"తల్లీ... మమ్మల్ని ఇలాగైనా ఉండనియ్యవా? పిలవని పేరంటానికి వచ్చావు. నీ లీలలు, ప్రణయాలు అన్నీ పత్రికల్లో చదివాం. అమ్మా... చేతులెత్తి నమస్కరిస్తాం. మా ఇంటికి రాకు. మీ అన్నయ్యా, నేనూ చచ్చాం అనుకో. మమ్మల్ని పరువుగా బ్రతకనియ్యి, దయ చెయ్యి" అన్నది.

ఆనాడు ఇందిర రాఘవరావుని చూసిన చూపు ఇంకా గుర్తుంది.

ఎంతో ఆశతో వచ్చిన ఇందిర వెళ్ళిపోయింది - రాఘవరావు అసమర్ధతకు కన్నీళ్ళు పెట్టుకుని.

"అమ్మా! నీ అన్నయ్య అసమర్ధుడు - క్షమించు. తోడబుట్టిన నీకు ఏం చెయ్యలేని అల్పజీవి" - రాఘవరావు తలొంచుకున్నాడు.

ఇందిర తారాపథంలో వెడుతూ గుర్తొచ్చినప్పుడు డబ్బు పంపితే -

"డబ్బేం చేదా తీసుకోండి" - భార్య సలహా ఇచ్చింది.

రాఘవరావు అప్పుడు కూడా తల వంచేశాడు భార్య మాటకు.

ఊళ్ళో పరపతి పెరిగింది... సినిమా తార... ఇందిర ... అన్నయ్యగా!

అయినా రాఘవరావు వంచిన తల ఎత్తలేదు.

కానీ... భార్య... కొడుకులు.. కోడళ్ళు... తమ్ముళ్ళు... చెల్లెళ్ళు... అందరూ గర్వంగా తలెత్తుకుని -

"అవునండీ... ఇందిర...మా..."

అని గర్వంగా చెప్పుకునే వాళ్ళు. రోజులు, నెలలు, సంవత్సరాలు గడిచాయి.

ఈనాడు, ఇందిర పెద్ద తార... లక్షలు, కోట్లు గడిస్తున్నది. మేడలు, కార్లు, పలుకుబడి.

రాఘవరావు ముతక ధోవతి, లాల్చీ, పై పంచతో తలొంచుకునే బ్రతికాడు.

కొడుకుల పెళ్ళి - పురుళ్ళు - కూతుళ్ళ పెళ్ళి - అప్పగింతలు - పురుళ్ళు - పుణ్యాలు - గృహప్రవేశం - ఊహూ - ఇందిర రాలేదు - పిలవలేదు.

"అబ్బే ఆవిడ కంటికి మేమెక్కడ అనతాం. రాదండీ - అబ్బే రాదు - డబ్బు పంపుతుంది - డబ్బా ముఖ్యం - బంధుత్వం" భార్య సంజాయిషీ.."

ఇందిర డబ్బు మనుష్యుల్ని దగ్గర చేసింది. అభిమానాలు పెంచింది. ఏదో మిషతో అందరూ చుట్టరికం, బంధుత్వం కలుపుకుని ఇందిర ఇంటికి వెళ్ళి వస్తున్నారు. రాఘవ రావు ఏ నాడూ వెళ్ళలేదు.

సినిమా పత్రికలు, టీవీలు, ఇందిరను గురించి రకరకాల వార్తలను ప్రచురించి ప్రసారం చేస్తున్నాయి.

కానీ... రాఘవరావు అవి చదవడు.. చూడడు.

కళ్ళకు చత్వారం వచ్చింది - వయోభారం వల్ల, దేహంలో పటుత్వం తగ్గింది - అశక్తత, అనాసక్తత.

పడక కుర్చీలో అంపశయ్య మీద భీష్మడిలా ఏదో ఆలోచిస్తూ!

ఏదో ఆలోచన..మనస్సులో ఆవేదన...

తను.. తోడబుట్టిన చెల్లెలుకు ఏం చేశాడు?

అదే దిగులు.. గుండెల్లో బాధ.

అందరూ ... నిద్రలో ఉన్నారు. అర్ధరాత్రి గడిచినా రాఘవరావుకి నిద్ర రాలా? రాదు.

ఇది నిత్యకృత్యమే... చాలా రోజులుగా. తను స్వార్థపరుడు.

తన వాళ్ళకు చదువులు, పెళ్ళిళ్ళు, శుభకార్యాలు అన్నీ చేసిన తను ఇందిరకు ఏం చేశాడు?

ఏం చెయ్యాలనుకున్నాడు?

"ఒరే రాఘవా! ఊహ తెలియని పిల్ల - తల్లీ తండ్రీ అన్నీ నీవేరా! దాని బ్రతుకు బాధ్యత నీదే" అన్నది తల్లి.

'సరే!' అన్నాడు తల్లితో ఆనాడు.

అన్నీ గుర్తు వచ్చాయి రాఘవరావుకి - గతమంతా పీడకలలా కళ్ళ ముందు కదలాడింది - తెర మీద దృశ్యాలుగా ఒకదాని వెంట ఒకటి.

రాఘవరావు కళ్ళు మూసుకుని ఎంతసేపో... ఓ స్పర్శ... అనుభూతి.

కళ్ళు తెరిచాడు.

ఎదురుగా ఇందిర... కొవ్వొత్తిలా!

కోటాను కోట్ల ప్రేక్షకుల ఆరాధ్యదేవత.

రాఘవరావుకి ఇది కలో నిజమో తెలియదు. అలాగే చూస్తూ ఉండిపోయాడు అచేతనంగా!

"అన్నయ్యా - నీకు పక్షవాతం వచ్చిందని తెలిసింది. చూడాలని వచ్చా! నా తోటి రా- వైద్యం చేయిస్తా"

రాఘవరావుకి దుఃఖం ఆగలా!

ఇందిర చెయ్యి గుండెలకు అద్దుకుని - 'అమ్మా నీకేం చేశానని నా మీద ఇంత దయ చూపిస్తున్నావ్.. వద్దు తల్లీ... నీ అభిమానం చాలు.. ఈ అన్నయ్యను చూడడానికి వచ్చావ్. గాలికి, ఎండకూ, వానకూ పెరిగి పూచిన తంగేడు పువ్వువమ్మా నీవు. ఈ అభిమానం చాలు తల్లీ.. కన్న తల్లిలా... నా తప్పులు, పొరపాట్లు క్షమించు - అదే ఈ అసమర్థుడు చేసే ప్రార్థన' అని చెప్పాలని రాఘవరావు ప్రయత్నించాడు. మాట పెగల్లేదు, మూగబోయింది.

ఇందిర నటి కనుక అన్నయ్య కళ్ళల్లో, పెదాల కదలికల్లోని భావాన్ని గ్రహించింది.

పాదాలకు నమస్కరించి కళ్ళకు అద్దుకుని, ఇందిర

"అన్నయ్యా.. నేను నీకు భారం కాకూడదని స్వతంత్రంగా నా బ్రతుకు దారి వెతుక్కుని వెళ్ళాను. అంతేగానీ నిన్ను కించపరిచేలా ఏనాడూ ప్రయత్నించలా! నా క్షేమం కోరే అన్నయ్య వున్నాడన్న తృప్తి చాలు" అంది.

రాఘవరావు ఆ రాత్రి తృప్తిగా నిద్రపోయాడు.

"రాత్రి ఏమిటీ కలవరించారు?" అన్న భార్య ప్రశ్నకు రాఘవరావు నవ్వి ఊరుకున్నాడు. •